క్లుప్తంగా

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



మర్రిపాడు: మండల నూతన తహసీల్దార్‌గా పీ సీతారత్నం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలో భాగంగా బాపట్ల కలెక్టరేట్‌లో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆమె ఇక్కడకు వచ్చారు.

వరికుంటపాడు: మండల నూతన తహసీల్దార్‌గా ఆళ్ల చంద్రారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పలనాడు జిల్లా నరసరావుపేట తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలి



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ రమాదేవి

సంగం: జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. స్థానిక సచివాలయంలో జరుగుతున్న జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు చేపడుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ రాజానారాయణ, వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా నందీశ్వరుడికి అభిషేకం



సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి బుధవారం సాయంత్రం సకల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పుష్యమాసం బహుళ త్రయోదశి సందర్భంగా అరుణాచలంలోని మహానందీశ్వరుడికి అభిషేకాలు నిర్వహిస్తారు. అదే విధంగా సంగమేశ్వరాలయంలోని నందీశ్వరుడికి అర్చకుడు టంగుటూరు గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైతు మృతి



శ్రీను (ఫైల్)

కొండాపురం: వ్యవసాయంలో నష్టాలు రావడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు...గొట్టిగుండాలకు చెందిన పులివర్తి శ్రీను(36) రైతు. మినుము, వరి, మిరప, తదితర పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. మూడేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో ఆదివారం పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి అతనిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీను మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



ఆత్మకూరు(చేజర్ల): ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పాదలకూరు ఏడీఏ శివనాయక్ బుధవారం పరిశీలించారు. మండల ఏఓ వీ శశిధర్‌తో కలిసి చేజర్ల, చిత్తలూరు, పాడేరు, తదితర ప్రాంతాల్లో వీఏఏలు ఈక్రాప్‌లో నమోదు చేసిన పంట వివరాలను పరిశీలించారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీని రైతులు తప్పనిసరిగా చేసుకోవాలని ఏడీఏ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

మహాసంకల్ప అడుగులకు ఆరేళ్లు

- నియోజకవర్గంలో రెండ్రోజుల పాటు సాగిన జగనన్న పాదయాత్ర
- హసనాపురంలో ముస్లిం మైనార్టీలకు షాదీతోఫా ప్రకటన



ఆత్మకూరు నియోజకవర్గంలో యాత్ర సాగిస్తున్న జగనన్న, పక్కన ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన మహాసంకల్ప పాదయాత్ర చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఈ పాదయాత్ర ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రవేశించి బుధవారానికి సరిగ్గా ఆరేళ్లు పూర్తయింది. 2018 ఫిబ్రవరి 6న కోవూరు నియోజకవర్గంలో మహాసంకల్ప పాదయాత్రను పూర్తి చేసుకున్న జగనన్న సంగం మండలం దువ్వూరు వద్ద ఆత్మకూరు నియోజకవర్గంలోకి ప్రవేశించారు. అప్పటి ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆ రోజు రాత్రి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన షెల్టర్‌లో విశ్రాంతి తీసుకున్న జగనన్న మరుసటిరోజు 7వ తేదీ ఉదయం యాత్రను ప్రారంభించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సంగానికి చేరుకున్నారు. భోజన విరామానంతరం సంగం నడిబొడ్డున ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పోటెత్తి వచ్చిన జనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం నాలుగురోడ్ల కూడలి వద్ద 75 అడుగుల వైఎస్సార్‌సీపీ జెండాను అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో కలిసి జగనన్న ఆవిష్కరించారు. రాత్రి అక్కడ ఏర్పాటు చేసిన షెల్టర్‌లో విశ్రమించారు. మరుసటి రోజు 8వ తేదీ ఉదయం సంగం-కలిగిరి మార్గంలో యాత్ర సాగించారు. కొరిమెర్ల అడ్డరోడ్డు వద్ద 1100 కిలోమీటర్ల మైలురాయికి చేరుకోవడంతో అందుకు గుర్తుగా మొక్కను నాటారు. అనంతరం అనుమసముద్రం మండలంలోకి ప్రవేశించి మధ్యాహ్నానికి హసనాపురం సెంటర్ చేరుకున్నారు.

షాదీతోఫా ప్రకటన ఇక్కడే..

హసనాపురంలో ముస్లిం మైనార్టీలతో సమావేశమైన జగనన్న వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసే స్థితిలో లేరని తెలుసుకుని అధికారంలోకి వస్తే వైఎస్సార్ షాదీతోఫాను అమలు చేస్తామని ప్రకటించారు. అనంతరం జగనన్న పాదయాత్రగా సాగి ఏఎస్‌పేట మండలం జువ్వలగుంటపల్లి శివార్లలో రాత్రికి విడిది చేశారు. అక్కడి నుంచి కావలి నియోజకవర్గంలోకి ప్రవేశించగా అప్పటి ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీడ్కోలు పలికారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేకపాటి గౌతమ్‌రెడ్డి రెండోసారి ఆత్మకూరు ఎమ్మెల్యేగా 23వేల పైచీలుకు ఓట్లతో ఘన విజయం సాధించారు. జగనన్న సారథ్యంలో ఏర్పాటైన ప్రభుత్వంలో భారీ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రిగా ఆయన పనిచేశారు.



పాదయాత్రలో మహిళకు మనోధైర్యం చెబుతున్న జగనన్న (ఫైల్)

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



పోలేరమ్మ గ్రామోత్సవం

అల్లూరు: స్థానిక ఆర్డీఆర్‌కాలనీలో కొలువైన పోలేరమ్మ తిరనాళ్లలో భాగంగా బుధవారం అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మ ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం పోలేరమ్మ విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్ఠించారు. భక్తులు పోలేరమ్మను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలేరమ్మ, ఓబులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

తిరునాళ్ల సందర్భంగా ఆర్‌డీఆర్ కాలనీలో కొలువైన పోలేరమ్మ, రజక కాలనీలో కొలువైన ఓబులమ్మను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. అమ్మవార్ల వద్దకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు షేక్ ఉస్మాన్, మేడా శ్రీనివాసులరెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, చెంతాటి కరుణాకర్, బత్తల సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి దంపతులు

'కావ్య'ది నీచ చరిత్ర



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కావలి: కావలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డిది నీచచరిత్రని కావలి ఆర్‌కే దాబా యజమాని కృష్ణారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన కావలిలో మీడియాతో మాట్లాడారు. కావ్య చరిత్ర తనకు బాగా తెలుసునన్నారు. ఆయన తన వ్యాపారాల కోసం రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు చేయించేవాడని ఆరోపించారు. గతంలో రామానాయుడు, యానాదిశెట్టి వంటి నాయకులను చేరదీసి ఒకగదిలో రాత్రి వేళ జాగారం చేయించి పేకాట ఆడించేవాడన్నారు. ఈ పనులకు తానే ప్రత్యక్ష సాక్షినని ఆయన స్పష్టం చేశారు. అలాంటి పనులు చేసుకుంటూ బతుకుతున్న కావ్య తనకు రూ.6వేలు బాకీ ఉండి ఇవ్వకపోతే, యానాదిశెట్టి షాపులో రామానాయుడు సమక్షంలో తన్ని వసూలు చేసుకున్నానని చెప్పారు. గ్లోబుల్ ఆగ్రో ఫామ్ ఇండస్ట్రీస్ పేరుతో జనాల నుంచి నగదు వసూలు చేసి మోసం చేశాడని ఆరోపించారు. నీచ ప్రవృత్తి కలిగిన కావ్య తమ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోబోమన్నారు. కావలి నుంచి తరిమికొడుతామన్నారు.

రేపు సంగం-కలిగిరి రోడ్డు పనుల ప్రారంభం

అనుమసముద్రంపేట: మండల పరిధిలోని అక్బరాబాద్ వద్ద సంగం-కలిగిరి రోడ్డు పునరుద్ధరణ పనులను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగినికి గాయాలు

కొండాపురం: మండలంలోని కొండాపురం-ఆదిమూర్తిపురం మధ్యన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గానుగపెంట సచివాలయం ఇంజినీర్ అసిస్టెంట్ కీర్తి తీవ్రంగా గాయపడింది. వివరాలు.. గానుగపెంట సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ కీర్తి కొండాపురానికి స్కూటీపై వెళ్తుండగా ,కొండాపురం నుంచి ఆదిమూర్తిపురానికి బైక్‌పై వస్తున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఢీకొని పరారయ్యారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కీర్తిని నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కాగా స్కూటీని ఢీకొన్న వారు ఆదిమూర్తిపురంలో పొగాకు పనుల కోసం వలస వచ్చిన కూలీలుగా స్థానికులు పోలీసులకు తెలిపారు. ఏఎస్సై వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: మండలంలోని నందవరం కూడలి సమీపంలో బుధవారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారిపడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు..డీసీపల్లి నుంచి నందవరం కూడలి వైపునకు పొగాకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు వెనుక డోర్ ప్రమాదవశాత్తు ఊడి కింద పడడంతో దానిపై కూర్చున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్నుడ్ని హైవే అంబులెన్స్‌లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

సాయిపేట ఇన్‌చార్జి వీఆర్వోగా మల్లికార్జున

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీకి ఇన్‌చార్జి వీఆర్వోగా నేకునాంపేట వీఆర్వో మల్లికార్జునను నియమించినట్లు డీటీ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. గతంలో ఇక్కడ వీఆర్వోగా పనిచేస్తున్న ఏవీవీ ప్రసాద్‌రావు పదోన్నతిపై సోమశిలకు సీనియర్ అసిస్టెంట్‌గా వెళ్లడంతో ఇన్‌చార్జి వీఆర్వోగా మల్లికార్జునను నియమించినట్లు చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన



వైద్యులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ శీనానాయక్

అల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ అన్నారు. అల్లూరు సచివాలయం-1 పరిధిలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యసేవలు అందిస్తున్న తీరుపై వైద్యులు, రోగులను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు. దాదాపు 280 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సంగం : మండలంలో ఉడ్‌హౌస్‌పేట ప్రాథమిక పాఠశాలలో రమాబాయి అంబేడ్కర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రమాబాయి చిత్రపటంతో పాటు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. రమాబాయి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. గాంధీజనసంఘం పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరెడ్డి, తరుణవాయి పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుమతి, ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

ఉదయగిరి: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే పనులు మాత్రమే చేపట్టాలని ఏపీడీ గాయత్రిదేవి సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో క్లస్టర్ పరిధిలోని ఉపాధి క్షేత్రసహాయకులు, సిబ్బందితో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. వేసవిలో పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నియోజకవర్గంలో 1,450 ఎకరాల్లో ఉద్యాన తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యమన్నారు. అర్హులైన సన్న, చిన్నకారు రైతులు ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు అందజేస్తుందన్నారు. ఏప్రిల్ నుంచి ఫేస్‌యాప్ ద్వారా కూలీల హాజరు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీవార్మింగ్‌ను విజయవంతం చేయాలి



కలిగిరిలో డీ వార్మింగ్ డే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

వరికుంటపాడు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 9వ తేదీ చేపట్టనున్న డీ-వార్మింగ్ కార్యక్రమాన్ని విజవంతం చేయాలని వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా కోరారు. వరికుంటపాడు పీహెచ్‌సీలో డీ-వార్మింగ్ కార్యక్రమానికి సంబంధించిన మందులను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు బుధవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారితో మధ్యాహ్న భోజన అనంతరం ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. మండలంలో 56 అంగన్‌వాడీకేంద్రాలు, 58 ప్రభుత్వ పాఠశాలల్లోని 3,306 మందికి మాత్రలు మింగించాలని లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ పాల్గొన్నారు.

'డీ వార్మింగ్ డే' పోస్టర్ల ఆవిష్కరణ

కలిగిరి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో శుక్రవారం నిర్వహించనున్న డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని వైద్యాధికారిణి గీతారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో డీ వార్మింగ్ డేపై బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఏడాది నుంచి 19 ఏళ్ల వరకు ఉన్న విద్యార్థులతో డీవార్మింగ్ మాత్రలు మింగించాలన్నారు. అనంతరం డీ వార్మింగ్ డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎస్‌ఎస్‌వీ బ్రహ్మాచారి, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, ఎంఈఓ సురేష్, జూనియర్ అసిస్టెంట్ వెంగయ్య పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద బుధవారం రాత్రి నెల్లూరు-ముంబై రహదారిపై ఆగిఉన్న ద్విచక్ర వాహనచోదకుడిని గుర్తుతెలియని మరో ద్విచక్ర వాహనచోదకుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి వివరాల మేరకు.. టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న పెంచలయ్య పట్టణంలో మెకానిక్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో హైవేను క్రాస్ చేసేందుకు రోడ్డు పక్కన తన బైక్‌ను నిలిపి ఉండగా, నెల్లూరు నుంచి ఆత్మకూరుకు వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొని పరారయ్యాడు. పెంచలయ్య రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి పోలీసు కేసు నమోదు కాలేదు.

20 బాటిళ్ల మద్యం స్వాధీనం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట బస్టాండ్ సెంటర్ సమీపంలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి అక్రమంగా 20 బా మద్యం కలిగి ఉండగా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌పేట ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఊసా పుల్లయ్య అనే వ్యక్తి మద్యం అక్రమంగా కలిగి ఉన్నట్లు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకుని పరిశీలించగా 20 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని చెప్పారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని పుల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మూడు చెక్‌పోస్టుల ఏర్పాటు



దుత్తలూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ,ఎస్సైలు

దుత్తలూరు: ఎన్నికల నేపథ్యంలో ఉదయగిరి సర్కిల్ పరిధిలో సరిహద్దు ప్రాంతాల్లో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు సీఐ గిరిబాబు తెలిపారు. బుధవారం ఆయన దుత్తలూరులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి సర్కిల్ పరిధిలోని సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని చెప్పారు. ఎవరైనా మద్యం, నగదు అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఉమాశంకర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రోడ్డు భద్రతను పాటించాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న రవాణా, ఆర్టీసీ అధికారులు

ఆత్మకూరురూరల్: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆత్మకూరులో రవాణా, ఆర్టీసీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఉపరవాణా అధికారి రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ కరీమున్నీసా తమ సిబ్బందితో కలిసి ఆర్టీసీ డిపో నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రాములు ఈసందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎవరైనా వెంటనే ఆస్పత్రిలో చేర్పిస్తే వారికి ప్రభుత్వం రూ.5వేలు పారితోషికం అందజేస్తుందని తెలిపారు. అలాంటి వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు ఉండవన్నారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీకి అవమానం



ఎంపీటీసీ సభ్యురాలిని నిలబెట్టి మాట్లాడుతున్న డీఈ ప్రసాద్

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు పంచాయతీలోని 6వ వార్డు ఎంపీటీసీ సభ్యురాలు యాకసిరి భవానీకి అవమానం ఎదురైంది. బుధవారం గృహ నిర్మాణాలపై మాట్లాడేందుకు డీఈ కార్యాలయానికి వెళ్లగా ఇన్‌చార్జి డీఈ ప్రసాద్ ఆమెకు కనీస గౌరవం ఇవ్వకుండా అవమానించారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు..స్థానిక జీబీకేఆర్ కాలనీలో కొందరు ఎస్టీలకు మంజూరైన ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహాల గురించి మాట్లాడేందుకు లబ్ధిదారులతో కలిసి ఎంపీటీసీ సభ్యురాలు భవానీ డీఈ కార్యాలయానికి వెళ్లారు. ఇళ్ల నిర్మాణాల జాప్యంపై డీఈతో మాట్లాడుతుండగా ఎంపీటీసీని కనీసం కుర్చీలో కూర్చోమని కూడా చెప్పకుండా ఎస్టీ లబ్ధిదారులను అవమానకరంగా మాట్లాడారు. అదే సందర్భంలో పలువురు జగనన్న లేఅవుట్లకు సంబంధించిన కాంట్రాక్టర్లు కూడా కార్యాలయంలో ఉన్నప్పటికీ ఎంపీటీసీ సభ్యురాలికి కనీస మర్యాద కూడా ఇవ్వకుండా డీఈ అవమానకరంగా మాట్లాడిన తీరుపై పలువురు ఎస్సీ, ఎస్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్టీలను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడిన ప్రసాద్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. తాను ఎస్సీ కావడంతోనే డీఈ తనకు మర్యాద ఇవ్వకుండా అవమానించారని, తనకు జరిగిన అవమానంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీటీసీ సభ్యురాలు భవానీ తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కరీష్మా

వరికుంటపాడు: ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి కరీష్మా అన్నారు. బుధవారం ఆమె మండలంలోని కాంచెరువులో ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందించారు. 47 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇళ్ల వద్దకు వెళ్లి రోగులను పరీక్షించి ఆరోగ్య సూచనలు, సలహాలు అందజేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేయాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, వీఆర్వోలు, మహిళా పోలీసులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకుని తప్పులుంటే గుర్తించి తెలియజేయాలన్నారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ఈవీఎంలపై ఓటర్లలో అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో నెహ్రూబాబు, ఎన్నికల డీటీ శ్యామ్, కార్యాలయ డీటీ ఫాజిహా, సీనియర్ సహాయకుడు సందానిబాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి పంచాయతీ కార్యదర్శిగా షేక్ కరిముల్లా

ఉదయగిరి: ఉదయగిరి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా షేక్ కరిముల్లా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేస్తున్న నర్సయ్య వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీకి బదిలీ కావడంతో శకునాలపల్లి కార్యదర్శి కరిముల్లాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు.